VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ గురువారం 08 జనవరి 2026

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:03 సంచిక: 138

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



## కోళ్లు, మేకలవి ప్రాణాలు కావా:

న్యూఢిల్లీ: వీధి కుక్కలవివాదంపై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. వీధి కుక్కల రక్షణపై పెద్ద మొత్తంలో పిటిషన్‌లు దాఖలు అవుతుండడంపై అసహనం వ్యక్తం చేసింది. "అందరూ కుక్కల గురించే ఆలోచిస్తుంటే..ఇతర జంతువుల జీవితాల సంగతేంటి? కోళ్లు, మేకల గురించి ఎందుకు మాట్లాడరు?వాటివి ప్రాణాలు కావా" అని ఈ కేసులో కుక్కల రక్షణపై వాదించిన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్‌ను ప్రశ్నించింది. కుక్కలు కరవబోతున్నాయా లేదా అనే విషయాన్ని అవి దగ్గరకు వచ్చేంతవరకు తెలుసుకోలేమని వ్యాఖ్యానించింది.



2లో..

## ఫిబ్రవరిలో మున్సిపల్ ఎన్నికలు ?

అధికారులను సన్నద్ధం చేసిన కమిషనర్

కలెక్టర్లు, అలధికారులతో వీడియో కాన్ఫరెన్స్

ఓటర్ల జాబితాల సవరణ, అభ్యంతరాలపై షెడ్యూల్

ఎన్నికల నిర్వహణకు సన్నద్ధంగా ఉండాలని ఆదేశం

బ్యాలెట్ బాక్సులు, అవసరమైన సామగ్రి సిద్ధం చేయాలని జిల్లా ఉన్నతాధికారులకు ఎస్ఈసీ ఆదేశించింది. ఇక 2019 నాటి ఓటర్ల జాబితానే ప్రాతిపదికగా తీసుకోవాలని స్పష్టం చేసింది. పోలింగ్ స్టేషన్లలో బీఎల్‌వోల ద్వారా ఓటర్ల వివరాలను పరిశీలన చేయాలని సూచించింది.


2లో..

## డైలీ సీరియల్‌లా ఫోన్ ట్యాపింగ్ విచారణ

అన్ని వేళ్లూ ఒకేవైపు చూపిస్తున్నా చర్యలేవీ

అసెంబ్లీ నుంచి బిఆర్ఎస్ పారిపోయింది

బిజెపి మాత్రమే సమర్థ విపక్షంగా పనిచేసింది

మెదక్ ఎంపి రఘునందన్ రావు

అసెంబ్లీని బాయ్‌కాట్ చేసి.. ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ పూర్తి వైఫల్యం చెందిందని విమర్శించారు. నీటి అంశాలపై చర్చకు పాలక పక్షం మీనమేషాలు లెక్కిస్తే.. బీఆర్ఎస్ పార్టీ భయపడి పారిపోయిందని పేర్కొన్నారు. తమ సంఖ్య తక్కువ ఉన్నా గట్టిగా పోరాడి.. పాలక పక్షాన్ని బీజేపీ నిలదీసిందని గుర్తు చేశారు.

# ట్రైబ్యునల్లో తేలాలి.. ప్రాజెక్టులు అప్పగించాలి

### అప్పటి వరకు టెలిమెట్రీల ఏర్పాటు కుదరదు
### రెండు రాష్ట్రాలకు స్పష్టం చేసిన కృష్ణా బోర్డు
### తెలంగాణ ఇచ్చిన నిధులు బోర్డు నిర్వహణకు జమ

హైదరాబాద్: కృష్ణా జలాల పంపిణీపై బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ (కేడబ్ల్యూడీటీ-2) విచారణ పూర్తయి నీటి కేటాయింపులు తేలి.. ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించిన తర్వాత గానీ పరీవాహకంలో ప్రవాహాలను లెక్కించేందుకు టెలిమెట్రీ పరికరాల ఏర్పాటు కుదరదని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) స్పష్టం చేసింది. కీలకమైన ఈ రెండు అంశాలపై న్యాయ విచారణ కొనసాగుతున్నందున నిర్ణయం తీసుకోలేదని తెలిపింది. ఈ మేరకు తాజాగా తెలంగాణ, ఏపీలకు బోర్డు వేర్వేరుగా లేఖలు రాసింది. గతేడాది జనవరిలో జరిగిన బోర్డు 19వ సమావేశంలో టెలిమెట్రీల కోసం కమిటీని ఏర్పాటు చేయాలన్న నిర్ణయానికి వచ్చారు. బోర్డు నిర్వహణకు నిధులు కేటాయించడానికి కూడా ఏపీ, తెలంగాణ అంగీకరించాయి. టెలిమెట్రీల ఏర్పాటును ఏపీ వ్యతిరేకించగా.. ఏపీ వాటాను కూడా కలిపి ఇస్తామంటూ తెలంగాణ రూ.4.18 కోట్లను విడుదల చేసింది.



### జల వినియోగాలను పర్యవేక్షించడమే విధి

టెలిమెట్రీల ఏర్పాటుపై ఇటీవల బోర్డు కేంద్ర జలశక్తి శాఖను సంప్రదించింది. కేంద్రం సూచనలతో తాజాగా రాష్ట్రాలకు లేఖలు రాసింది. 'రెండు రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టులు శ్రీశైలం, నాగార్జునసాగర్‌ల కింద జల వినియోగాన్ని పర్యవేక్షించడమే బోర్డు విధి. ట్రైబ్యునల్ కేటాయింపులకు లోబడి ఈ జలాశయాల నుంచి నీటి విడుదల, వినియోగాన్ని బోర్డు నమోదు చేస్తుంది. 2021లో కేంద్రం విడుదల చేసిన గెజిట్ ప్రకారం రాష్ట్రాలు ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించాల్సి ఉంటుంది. దీనిపై సుప్రీంకోర్టులో వ్యాజ్యం కొనసాగుతోంది. బ్రిజేష్ ట్రైబ్యునల్లో నీటి కేటాయింపులపై విచారణ జరుగుతోంది. టెలిమెట్రీల ఏర్పాటు ప్రతిపాదనలపై తెలంగాణ సానుకూలంగా ఉండగా.. ఏపీ వ్యతిరేకిస్తోంది. న్యాయ వివాదాలు, ఏపీ వ్యతిరేకత నేపథ్యంలో ఆ పరికరాల ఏర్పాటు సాధ్యపడదు' అని బోర్డు లేఖలో స్పష్టం చేసింది.

టెలిమెట్రీల ఏర్పాటుకు తెలంగాణ గతేడాది కేటాయించిన రూ.4.18 కోట్లను బోర్డు నిర్వహణకు వినియోగిస్తామని బోర్డు స్పష్టంచేసింది. 2024-25, 2025-26 సంవత్సరాలకు సంబంధించి రెండు రాష్ట్రాలు రూ.23.31 కోట్ల చొప్పున చెల్లించాల్సి ఉంది. వెంటనే రాష్ట్రాలు బడ్జెట్‌ను విడుదల చేయాలని బోర్డు కోరింది.

### రెండో దశ టెలిమెట్రీలు ఏర్పాటు చేయాల్సింది ఇక్కడే..

మొదటి దశలో రెండు రాష్ట్రాల్లో 18 చోట్ల టెలిమెట్రీ పరికరాలు ఏర్పాటు చేశారు. రెండో దశలో తొమ్మిది చోట్ల ఏర్పాటు చేయాల్సి ఉంది. శ్రీశైలం కుడి ప్రధాన కాలువపై(పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ), నాగార్జునసాగర్ కుడి కాలువ, ఎడమ కాలువ, పాలేరు జలాశయం ఎగువన ఎడమ కాలువపై 136 కి.మీ. వద్ద, ఎడమ కాలువ 101.36 కి.మీ. వద్ద (ఏపీ సరిహద్దు), పోలవరం కాలువ, ప్రకాశం బ్యారేజీ పశ్చిమ, తూర్పు ప్రధాన కాలువలు, కడప-కర్నూల్ కాలువ(కేసీ నాల్)పై..

### సమావేశం పెట్టుకుందాం.. ఎజెండా పంపండి

కేఆర్ఎంబీ సర్వసభ్య సమావేశం నిర్వహించుకుందామని ఏపీ, తెలంగాణ ఎజెండా జాబితాను పంపాలంటూ రెండు రాష్ట్రాలకు కృష్ణా బోర్డు తాజాగా గుర్తు చేసినట్లు తెలిసింది. ఎజెండాను గతేడాది డిసెంబరు ఆఖరు నాటికి అందజేయాలంటూ గతంలోనే లేఖలు రాసినా రెండు రాష్ట్రాలు అందజేయలేదు. దీంతో తాజాగా మరోమారు లేఖలు రాసింది. ఈ నెలాఖరున సమావేశం ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలిసింది.

## హామీల అమలులో.. సీఎం విఫలం

అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికే కేసీఆర్‌పై దుష్ప్రచారం

భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

కెసిఆర్ అప్పులు చేసింది నిజమే

ఆ అప్పులు తెలంగాణ అభివృద్ధి కోసమే

సిఎం రేవంత్ ఫ్రస్టేషన్‌లో ఉన్నాడు

కొత్త పల్లవి అందుకున్న బిఆర్ఎస్ నేత కెటిఆర్


2లో..

## సంక్రాంతి సందర్భంగా కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్

అన్ని చెరువుల వద్ద కైట్ ఫెస్టివల్

ప్రపంచ పర్యాటకంగా తెలంగాణ అభివృద్ధి

అధికారులతో కలసి సమీక్షించిన మంత్రి జూపల్లి


2లో..


2లో..

## ఆపరేషన్ సిందూర్ సమయంలో ఉచిత సలహాలు

అవేవీ పట్టించుకోకుండా భారత్ భద్రతపై దృష్టి

విదేశాంగమంత్రి జైశంకర్ వ్యాఖ్య


2లో..

## చైనా, రష్యాల, క్యూబాలతో దోస్తీ కట్ చేసుకో

వెనిజువెలా కొత్త అధ్యక్షురాలుకు ట్రంప్ హెచ్చరికలు

కోడై కూస్తున్న అంతర్జాతీయ మీడియా

## చెట్టును ఢీ కొన్నకారు....

### నలుగురు విద్యార్థుల దుర్మరణం

మోకిల: రంగారెడ్డి జిల్లా మోకిల పరిధిలో గురువారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది. మీర్జాగూడ వద్ద చెట్టును కారు ఢీ కొట్టిన ఘటనలో నలుగురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ముగ్గురు ఐసీఎఫ్ఏఐ వర్సిటీ విద్యార్థులు కాగా, మరొకరు ఎంజీఐటీ విద్యార్థి. మృతులను సూర్యతేజ, సుమిత్, శ్రీనిఖిల్, రోహిత్‌గా గుర్తించారు. నక్షత్ర అనే విద్యార్థినికి తీవ్రగాయాలయ్యాయి. ఆమెను

ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరంతా మోకిల నుంచి హైదరాబాద్ వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.





వేగుచుక్క

# విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంటూ దుష్ప్రచారం



విశాఖపట్నం: విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ పునరుద్ఘాటించారు. ఈ స్టీల్ ప్లాంట్ భూములు విషయంలో ఎవరైనా స్టేట్‌మెంట్ ఇచ్చారా? అని విలేకర్లను ఆయన సూటిగా ప్రశ్నించారు. స్టీల్ ప్లాంట్ భూములను వాటి అవసరాలకు తప్ప,
మరే ఇతర అవసరాలకు వినియోగించ లేదని.. వినియోగించబోమని ఆయన స్పష్టం చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ లాభాల బాటలో నడవాలని.. అందుకు అందరూ సహకరించాలని ఈ సందర్భంగా లోకేశ్ పిలుపు నిచ్చారు. బుధవారం విశాఖపట్నంలో మంత్రి విలేకర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు అడిగిన ప్రశ్నలకు ఆయన జవాబిచ్చారు. భోగాపురం విమానాశ్రయం క్రెడిట్ కోసం ఎవరూ పోరాటాలు చేయడం లేదని లోకేశ్ పేర్కొన్నారు. ఎర్ర బస్సు రాని ప్రాంతానికి ఎయిర్ పోర్టు ఎందుకని గతంలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. జగన్ ప్రభుత్వ హయాంలో జీఎంఆర్‌కు ఇచ్చిన భూములను వెనక్కి తీసుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మళ్లీ ఆ భూములను జీఎంఆర్‌కు కేటాయించామని వివరించారు. భోగాపురం ఎయిర్ పోర్ట్ క్రెడిట్ కావాలంటే తీసుకోవచ్చంటూ వైసీపీ వాళ్లకు లోకేశ్ సూచించారు. చిత్తూరు జిల్లా నుంచి అమర్ రాజా బ్యాటరీస్ వెళ్లగొట్టిడం, పీపీలు రద్దు, పలు కంపెనీలను రాష్ట్రం నుంచి పంపేయడం, ఆఫీస్ అద్దాలు పగలగొట్టడం వంటి సంఘటనల క్రెడిట్ అంతా వైసీపీకే దక్కుతుందని లోకేశ్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఒకటి రెండు నెలల్లో విశాఖపట్నం వేదికగా గూగుల్ డేటా సెంటర్ పనులు ప్రారంభమవుతాయని లోకేశ్ చెప్పారు. భోగాపురం ఎయిర్ పోర్టు కనెక్టింగ్ రోడ్లపై దృష్టి సారించామని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఒక్క 108 వాహనం ఆగలేదన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో చాలా 108 వాహనాలు ఆగిపోయాయని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. ఉద్యోగాలు కల్పించడానికే తక్కువ ధరలకు భూములు కేటాయిస్తున్నామని.. అది కూడా సామర్థ్యం ఉన్న కంపెనీలకే ఇస్తున్నామని లోకేశ్ వివరించారు. గత ఐదేళ్లలో వైసీపీ చేయలేని పని తాము ఇప్పుడు చేస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పెట్టుబడులు తీసుకు వస్తున్నామని తెలిపారు. రాజకీయ లబ్ధి పొందటానికి కొంత మంది జల వివాదం చేస్తున్నారంటూ మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. 2020లో అధికారంలో ఎవరున్నారని జలవివాదంపై ప్రశ్న అడిగిన విలేకర్లను లోకేశ్ నిలదీశారు.

## పరువు నష్టం కేసులో విశాఖ కోర్టుకు లోకేశ్

### అనంతరం పార్టీ కార్యాలయంలో అర్జీల స్వీకరణ

విశాఖపట్నం: సాక్షి దినపత్రిక మీద ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ దాఖలు చేసిన పరువు నష్టం దావా కేసులో బుధవారం క్రాస్ ఎగ్జామినేషన్ జరిగింది. విశాఖపట్నం 12వ అదనపు జిల్లా న్యాయస్థానంలో ఈ విచారణ సాగింది. కేసు విచారణ నిమిత్తం నిన్న విశాఖపట్నం వెళ్లిన మంత్రి నారా లోకేష్ ఇవాళ జిల్లా కోర్టుకు హాజరై, సాక్షి తరఫు న్యాయవాదులు నిర్వహించిన క్రాస్ ఎగ్జామినేషన్‌కు సమాధానమిచ్చారు. ఈ కేసుకు సంబంధించి ఇది మూడోసారి జరిగిన క్రాస్ ఎగ్జామినేషన్ కావడం విశేషం. విచారణ అనంతరం, 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి కేసును ఈ నెల 21వ తేదీకి వాయిదా వేశారు. ఇలా ఉండగా, 2019లో 'సాక్షి' దిన పత్రికలో ప్రచురితమైన కథనంపై లోకేష్ కోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. సదరు కథనం తప్పులు, కుట్రతో కూడుకున్నదని, ఇది.. తన పరువుకు నష్టం కలిగించే విధంగా ఉందని లోకేష్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఇందుకు లోకేష్ రూ.75 కోట్ల పరిహారం డిమాండ్ చేస్తూ కోర్టుకెక్కారు. ఈ కేసు ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది. పత్రిక యాజమాన్యం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి సంబంధించినది కావడంతో మరింత ఆసక్తికరంగా మారింది. తదుపరి విచారణలో కేసు కీలక దశకు చేరుకోనుంది. కోర్టు పని మీద తాను విశాఖకు చేరుకున్న విషయాన్ని మంత్రి నారా లోకేష్ ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసిన సంగతి తెలిసిందే. అనంతరం విశాఖ పార్టీ కార్యాలయానికి చేరుకుని ప్రజలు, పార్టీ కార్యకర్తల నుంచి అర్జీలు స్వీకరించారు..

## సంక్రాంతి సందర్భంగా కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్



హైదరాబాద్: ఈ సంక్రాంతి పండుగను సంప్రదాయం, సంస్కృతి పరిరక్షణకు అనుగుణంగా ఘనంగా జరుపుతున్నామని తెలంగాణ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. రాష్ట్ర టూరిజాన్ని ప్రమోట్ చేయడానికి ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. జనవరి 13 నుంచి 17 వరకు 'కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్' పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ఫెస్టివల్‌లో 19 దేశాల నుంచి 40 మంది అంతర్జాతీయ కైట్ ప్లేయర్స్, అదేవిధంగా మన దేశంలోని 15 రాష్ట్రాల కైట్ ప్లేయర్స్ పాల్గొంటున్నారని తెలిపారు. ఈ ఉత్సవంలో వివిధ రాష్ట్రాలకు చెందిన స్వీట్ స్టాల్‌లు కూడా ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. జనవరి 16 నుంచి 18 వరకు హాట్ ఎయిర్ బెలూన్ షో కోసం ఏవియేషన్ అనుమతి ఇప్పటికే తీసుకున్నామన్నారు. ఈ బెలూన్ షో బుకింగ్ కోసం ఆన్‌లైన్ సౌకర్యం కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. గచ్చిబౌలి స్టేడియంలో పగలు గోల్ఫ్ కోర్స్, పరేడ్ గ్రౌండ్‌లో నైట్ డ్రోన్ షోలు కూడా ఉంటాయన్నారు. చెరువుల పరిరక్షణ లక్ష్యంగా నగరంలోని అన్ని చెరువుల వద్ద కైట్ ఫెస్టివల్ కార్యక్రమం జరుగుతుందని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. పర్యాటకం అంటే కేవలం వినోదం కాదు, ఇది రాష్ట్ర ఆర్థిక రంగానికి చుక్కాని. ఇది ప్రత్యక్షంగా, పరోక్షంగా వాణిజ్య కార్యకలాపాలకు ఊతమిస్తూ రెవెన్యూను, విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జిస్తుంది. పర్యాటకం ప్రత్యక్షంగా, పరోక్షంగా వివిధ రంగాలను ప్రభావితం చేస్తుంది. స్థానికులకు ఉద్యోగ, ఉపాధి కల్పనకు అవకాశమిస్తుంది. ప్రపంచాన్ని కొత్తగా చూడటం ఎలాగో నేర్పుతుంది. హోటళ్లు, రవాణా, రిటైల్ షాపులు దీనివల్ల భారీగా లబ్ధి పొందుతాయి. అంతేకాదు.'క్రాస్ కల్చరల్ ఇంటరాక్షన్'– అంటే వివిధ సంస్కృతులు, సంప్రదాయాలు, నేపథ్యాలు ఉన్నవారి మధ్య బంధం బలపడేలా చేస్తుందని మంత్రి అభిప్రాయపడ్డారు. పర్యాటకుల కోసం ఏర్పాటు చేసే రహదారులు, ఎయిర్‌పోర్టులు, తాగునీరు, పారిశుద్ధ్య సేవల అభివృద్ధి స్థానిక ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తుంది. నూతన పర్యాటక విధానం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రవ్యాప్త సమతుల్య అభివృద్ధి కోసం 27 ప్రత్యేక పర్యాటక ప్రాంతాలను గుర్తించాం అని జూపల్లి అన్నారు. టూరిజం కాంక్లేవ్, గ్లోబల్ సమ్మిట్ ద్వారా 22,324 కోట్ల పెట్టుబడి ఒప్పందాలు జరిగాయి. దీని ద్వారా సుమారు 90,000 ఉద్యోగాల కల్పనే మా లక్ష్యం అన్నారు. బతుకమ్మ ఉత్సవాల్లో 19.44 మీటర్ల అతిపెద్ద బతుకమ్మ, 1,354 మంది మహిళలతో నృత్యం ద్వారా రెండు గిన్నిస్ రికార్డులు సాధించి తెలంగాణ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేశామన్నారు. మిస్ వరల్డ్ వేడుకలు, గ్లోబల్ సమ్మిట్‌ల నిర్వహణతో తెలంగాణ పెట్టుబడులకే కాదు, వ్యాపారానికి, పర్యటనకు అత్యంత 'సురక్షితమైన రాష్ట్రం' అని నిరూపించాం అన్నారు. మన పండుగలు ప్రపంచ పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. ఈ సంక్రాంతికి 'అతిథి దేవోభవ' అనే ఆత్మీయ సంస్కారంతో ఆతిథ్య రంగం సిద్ధంగా ఉందన్నారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే ఈ ఉత్సవంలో ఇండోనేషియా, ఆస్ట్రేలియా, కెనడా, శ్రీలంక, కంబోడియా, థాయిలాండ్, కొరియా, జపాన్, పోర్చుగల్, వియత్నాం, మలేషియా, ఇటలీ, స్విట్జర్లాండ్, అల్జీరియా, సింగపూర్, రష్యా, ఉక్రెయిన్ / ఫ్రాన్స్ వంటి 19 దేశాలకు చెందిన 40 మంది అంతర్జాతీయ కైట్ ఫ్లయర్స్, అలాగే భారతదేశంలోని 15 రాష్ట్రాల నుండి 55 మంది జాతీయ కైట్ ఫ్లయర్స్ పాల్గొంటారు.

రాత్రి వేళ ఆకాశంలో వెలుగులు విరజిమ్మే 'నైట్ ఫ్లయింగ్'కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణ కానుందని అన్నారు.

తెలంగాణ స్థానిక సంస్కృతిని ప్రోత్సహించేలా రాష్ట్ర సాంప్రదాయ కళా రూపాలతో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడతాయి. వేదిక వద్ద సుమారు 100 చేనేత, హస్తకళల స్టాల్స్, తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల రుచులతో కూడిన 60 ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కల్చర్ లాంగ్వేజ్ ఇండియన్ కనెక్షన్స్ సహకారంతో జరిగే ఈ ఉత్సవంలో ఇతర రాష్ట్రాలు, దేశాల నుండి వచ్చి హైదరాబాద్ లో స్థిరపడిన వారు తమ ఇళ్లలో తయారు చేసిన 1,200 కంటే ఎక్కువ రకాల మిఠాయిలనుప్రదర్శిస్తారని అన్నారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో జనవరి 16 నుండి 18 వరకు నిర్వహించ బడుతుందన్నారు. ఐరోపా దేశాలకు నుంచి వచ్చే ప్రతినిధులతో అంతర్జాతీయ స్థాయి 15 బెలూన్లతో ప్రదర్శన. ఉదయం పూట హైదరాబాద్ శివార్లలో, సాయంత్రం వేళ పరేడ్ గ్రౌండ్స్‌లో 'నైట్ గ్లో బెలూన్స్' ప్రదర్శన ఉంటుందన్నారు. జనవరి 16 / 17 తేదీల్లో గచ్చిబౌలి స్టేడియంలోఅత్యాధునిక డ్రోన్లు, మల్టీ–కలర్ ఎఇడి లైట్లు, గగనతల విన్యాసాలతో ఈ షో సాగనుంది. ఇది భారతీయ సాంస్కృతిక వారసత్వం నుండి ఆధునిక ఆవిష్కరణల వరకు సాగిన ప్రయాణాన్ని ప్రతిబింబిస్తుంది. హైదరాబాద్ – సోమశిల – శ్రీశైలం సర్క్యూట్‌లో పూర్తిస్థాయి హెలీ టూరిజం సేవలు అందుబాటులోకి వస్తాయి. నాగార్జున సాగర్, సోమశిల, బస్వాపూర్ ప్రాంతాలను ప్రపంచ స్థాయి వెడ్డింగ్ డెస్టినేషన్లుగా తీర్చిదిద్దడం లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. హైదరాబాద్‌ను గ్లోబల్ మెడికల్ టూరిజం హబ్‌గా మార్చడానికి ప్రత్యేక సొసైటీ స్థాపన చేస్తున్నామని అన్నారు. పర్యాటకుల భద్రత కోసం 'టూరిస్ట్ పోలీస్' అందుబాటులోకి వస్తుందన్నారు. పర్యాటకం అంటే కేవలం సందర్శన కాదు, అది ఒక అనుభూతి. అది మనల్ని మూసధోరణుల నుంచి బయటపడేలా చేసి, మానసిక వికాసానికి, ఉత్సాహానికి దోహదపడుతుంది. వారసత్వ కట్టడాల పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ మా ప్రభుత్వ బాధ్యత. మన పర్యాటకానికి యువత, టెక్కీలు, మీడియా, సెలబ్రిటీలు మరియు ఇన్ఫ్లుయెన్సర్లు రాయబారులుగా మారి... 'తెలంగాణ జరూర్ ఆనా' అంటే తెలంగాణకు తప్పక రండి అనే ఆత్మీయ పిలుపును ప్రపంచానికి చాటాలని కోరుతున్నట్లు వెల్లడించారు. పర్యాటకంపై అధికారులతో మంత్రి సమీక్షించి వివరాలు వెల్లడించారు.

# హామీల అమలులో.. సీఎం విఫలం



ఖమ్మం: తెలంగాణకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అద్భుతమైన ప్రాజెక్టులు తీసుకొచ్చారని కెటిఆర్ గుర్తు చేశారు. కేసీఆర్ అప్పు చేసిన మాట వాస్తవమేనని కేటీఆర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. అయితే చేసిన అప్పు తెలంగాణ రాష్ట్రాభివృద్ధి కోసం వినియోగించారని వివరించారు. ఇందులో ఎలాంటి అనుమానాలు అక్కర్లేదన్నారు. ఇకపోతే సీఎం రేవంత్ రెడ్డి తీవ్రమైన ఫ్రస్టేషన్‌లో ఉన్నారని కెటిఆర్ అన్నారు. ఆయనలో అంత ఫ్రస్టేషన్ ఎందుకో తనకు అర్థం కావడం లేదని తెలిపారు. సెక్యూరిటీ వాళ్ళతో పాటు పోలీసుల్ని సైతం ఆయన కొడుతున్నారని ఆరోపించారు. 'రేవంత్ రెడ్డి ఫ్రస్టేషన్‌లో ఉన్నాడని.. అరుస్తున్నాడు.. కొడుతున్నాడు.. రేపు ఎవరినైనా కరుస్తాడేమో జాగ్రత్త' అంటూ సీఎం భార్య గీతకు ఈ సందర్భంగా కేటీఆర్ హితవు పలికారు. అధికార కాంగ్రెస్ పార్టీలోని అగ్రనేతలకు, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీలోని కీలక నేతల మధ్య మాటలు తూటాలు పేలుతున్న క్రమంలో కెటిఆర్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఈ రెండు పార్టీల మధ్య విమర్శలు, ప్రతి విమర్శలతో మాటల వేడి బాగా పెరిగింది. తాజాగా బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ బుధవారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ ప్రభుత్వంతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని రైతుబంధు ఏమైందని ప్రశ్నిస్తే.. లాగులో తొండలు వదులుతాం అంటున్నారని మండిపడ్డారు. ఎప్పటికప్పుడు న్యూఢిల్లీ పోయి కప్పం కట్టి వస్తున్నారని విమర్శించారు. ఢిల్లీలో కప్పం కట్టకపోతే తన పదవి ఉండదని.. ఊడిపోతుందని ముఖ్యమంత్రి రేవంత్‌కి తెలుసునన్నారు. తాను ఆంధ్రప్రదేశ్ వెళ్లి చదువుకుంటే తప్పు.. ఆయన మాత్రం ఆంధ్రాలోని భీమవరంకు చెందిన వ్యక్తిని అల్లుడిగా తెచ్చుకోవచ్చు నంటూ కేటీఆర్ వ్యంగ్యంగా పేర్కొన్నారు. తాను అమెరికాలో బాత్‌రూమ్‌లు కడుక్కుంటున్నానని అన్నారు. మరి అమెరికాలో మీ సోదరుడు జగదీష్ రెడ్డి కూడా ఉన్నాడని.. ఆయన తన ఇంట్లో ఆయనే కడుక్కోవట్లేదా? అంటూ సీఎం రేవంత్‌ను ఈ సందర్భంగా కేటీఆర్ చురకలంటించారు. అమెరికాలో ఎవరింట్లో పనులు వాళ్ళే చేసుకుంటారని.. ఈ విషయం తెలయకుంటే తెలుసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ ఈ సందర్భంగా సూచించారు. ప్రజలు.. మిమ్మల్ని గెలిపించింది ఈ పనికిమాలిన డైలాగుల కోసం కాదని.. పనిచేసి చూపించాలంటూ సీఎం రేవంత్ రెడ్డికి ఆయన స్పష్టం చేశారు. యూరియా బస్తాల కోసం ప్రతి రోజు షాపుల ముందు రైతులు క్యూ కడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. షాపుల్లో యూరియా లేనప్పుడు అందుకోసం రూపొందించిన యాప్‌లు ఏమి చేస్తాయంటూ సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. యూరియా అంశంలో యాప్‌ల సమస్య రావడంతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం కొత్త డ్రామాకు తెరలేపిందని విమర్శించారు. ఇప్పుడు కొత్తగా మళ్ళీ కార్డులు తీసుకు వస్తామని ప్రభుత్వం చెబుతుందన్నారు.

# ఫిబ్రవరిలో మున్సిపల్ ఎన్నికలు ?




హైదరాబాద్: తెలంగాణలో ఇటీవలే గ్రామ పంచాయతీ ఎన్నికలు సమమర్థంగా నిర్వహించిన రాష్ట్ర ఎన్నికల సంఘం.. తాజాగా మున్సిపల్ ఎన్నికలపై దృష్టి సారించింది. ఈ ఎన్నికల సన్నద్ధతపై రాష్ట్ర ఎన్నికల సంఘం(ఎస్ఈసీ) కసరత్తు చేస్తోంది. తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణ కోసం రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) పూర్తి స్థాయిలో సన్నద్ధమవుతోంది. ఈ మేరకు జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, మున్సిపల్, కార్పొరేషన్ కమిషనర్లతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు తీసుకోవాల్సిన చర్యలు, టైమ్‌లైన్స్‌పై కమిషన్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసారు. అందుకోసం బుధవారం జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లతో రాష్ట్ర ఎన్నికల సంఘం ఉన్నతాధిరులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ÷ూష్ట్ర వ్యాప్తంగా గతేడాది డిసెంబర్‌లో మూడు విడతలుగా గ్రామ పంచాయతీ ఎన్నికలను రాష్ట్ర ఎన్నికల సంఘం విజయవంతంగా నిర్వహించింది. తాజాగా.. మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు సన్నాహాలు చేపట్టింది. అందుకోసం జిల్లా, మున్సిపల్ ఉన్నతాధికారులతో ఎస్ఈసీ కీలక సమావేశం నిర్వహించింది. ఈ మున్సిపల్ ఎన్నికలు ఫిబ్రవరిలో జరుగుతాయని ఒక చర్చ సైతం సాగుతోంది. ఈ క్రమంలో తాజా ఆదేశాల మేరకు జనవరి 12లోగా ఓటర్ల తుది జాబితా ప్రచురించాలని ఈ సందర్భంగా ఆయా అధికారులను ఎస్ఈసీ ఆదేశించింది. అలాగే జనవరి 13న టీ పోల్ యాప్‌లో పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితా అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేసింది. ఇక.. జనవరి 16న పోలింగ్ స్టేషన్ల వారీగా.. ఫొటోలతో కూడిన తుది ఓటర్ల జాబితా ప్రచురించాలని సూచించింది. బ్యాలెట్ బాక్సులు, అవసరమైన సామగ్రి సిద్ధం చేయాలని జిల్లా ఉన్నతాధికారులకు ఎస్ఈసీ ఆదేశించింది. ఇక 2019 నాటి ఓటర్ల జాబితానే ప్రాతిపదికగా తీసుకోవాలని స్పష్టం చేసింది. పోలింగ్ స్టేషన్లలో బీఎల్‌వోల ద్వారా ఓటర్ల వివరాలను పరిశీలన చేయాలని సూచించింది. ఆన్‌లైన్‌లో కూడా ఓటరు నమోదు, మార్పులకు అవకాశమిచ్చిందని వివరించింది. ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాల ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల నియమావళిని కఠినంగా అమలు చేయాలని జారీచేసిన ఆదేశాల్లో ఎస్ఈసీ స్పష్టం చేసింది. జనవరి 12 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ, 13 వరకు అభ్యంతరాల పరిశీలన ప్రారంభం, 16న ఓటరు జాబితా విడుదల చేయాలని ఆదేశం ఇచ్చారు. సమావేశంలో భాగంగా కలెక్టర్లకు ముఖ్యంగా ఓటర్ల జాబితా, పోలింగ్ స్టేషన్ల వివరాల ప్రచురణపై డెడ్‌లైన్లు నిర్దేశించారు. జనవరి 12వ తేదీ నాటికి తుది ఓటర్ల జాబితాను తప్పనిసరిగా ప్రచురించాలని ఈసీ ఆదేశించింది. 13వ తేదీ నాటికి పోలింగ్ స్టేషన్ల వివరాలతో కూడిన ముసాయిదా జాబితాను విడుదల చేసి, వెంటనే టీ పోల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఇక, జనవరి 16వ తేదీ లోపు పోలింగ్ స్టేషన్ల పూర్తి వివరాలతో పాటు ఫోటోలతో కూడిన తుది జాబితా, తుది ఓటర్ల జాబితాను వార్డు పరిధిలోని అన్ని పోలింగ్ స్టేషన్లలో ప్రదర్శించాలని ఆదేశించారు. ఈ చర్య ద్వారా ఓటర్లకు తమ పోలింగ్ కేంద్రం, వివరాలు సులభంగా అందుబాటులోకి వస్తాయని ఈసీ పేర్కొంది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులపై కూడా ఈసీ కలెక్టర్లకు దిశానిర్దేశర చేసింది. పోలింగ్‌కు అవసరమైన బ్యాలెట్ బాక్స్‌లు, ఎన్నికల సిబ్బంది నియామకం, రిటర్నింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్స్, సిట్టింగ్/సర్వైలెన్స్ స్క్వాడ్లు నియమించి, ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించాలని కమిషన్ సూచించింది. మరోవైపు, ఎన్నికల ఏర్పాట్లు పారదర్శకంగా, సమయపాలనతో జరిగితేనే ప్రజాస్వామ్య ప్రక్రియ బలోపేతమవుతుందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ స్పష్టం చేశారు. కలెక్టర్లు ఈ డెడ్‌లైన్లను కచ్చితంగా పాటిస్తూ, అన్ని విభాగాలను సమన్వయం చేసుకుని ఎన్నికలకు సిద్ధం కావాలని ఆదేశించారు. అయితే, మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో ఈసీ తీసుకున్న ఈ నిర్ణయాలు ఎన్నికల వేళ కీలకంగా మారనున్నాయి. ఓటర్లకు ఇబ్బందులు లేకుండా ఎన్నికలు జరగాలనే లక్ష్యంతోనే ఈ ఆదేశాలు జారీ చేసినట్లు కమిషన్ వర్గాలు వెల్లడించాయి.

## ఆపరేషన్ సిందూర్ సమయంలో ఉచిత సలహాలు

న్యూఢిల్లీ: పాకిస్థాన్ ఉగ్ర దాడులకు ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సమయంలో పశ్చిమ దేశాలు కపటత్వం ప్రదర్శించడంపై విదేశాంగ మంత్రి జై శంకర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తమకు వేల మైళ్ల దూరంలో ఉన్న ఆ దేశాలు ఉద్రిక్తతల సమయంలో ఆందోళన చెందినట్లు చెప్పాయని.. కానీ అవేవీ తమ సొంత ప్రాంతంలో జరుగుతున్న వాటిని పట్టించుకోవడం లేదని విమర్శించారు. లక్సెంబర్గ్‌లోని భారత కమ్యూనిటీ సభ్యులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సాయం చేయాలనుకునే వారితో కలిసి పని చేసేందుకు భారత్ సిద్ధంగా ఉంటుందని జైశంకర్ పేర్కొన్నారు. అదే.. పాకిస్థాన్‌లా ప్రవర్తిస్తే మాత్రం వాటికి అలాగే సమాధానం చెబుతామని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లో జరిగే పరిణామాలు దేనిని ఏమేరకు ప్రభావితం చేస్తాయో చెప్పడం కష్టమన్నారు. ఆలోచన లేకుండా ఎక్కడో దూరంగా కూర్చొన్నవారు.. ఉచిత సలహాలు ఇస్తున్నారని, అవి కొన్నిసార్లు స్వార్థంగా, నిర్లక్ష్యంగా ఉంటున్నాయన్నారు. ప్రస్తుతం చాలా దేశాలు తమ స్వార్థం కోసం మాత్రమే పని చేస్తున్నాయన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఎలా వ్యవహరించాలనే దానిపై పలు దేశాలు భారత్‌కు సలహాలు ఇచ్చాయన్నారు. కానీ అవేవీ పట్టించుకోకుండా దేశ భద్రత కోసం భారత్ ముందుకుసాగిందన్నారు.

## చైనా, రష్యాల, క్యూబాలతో దోస్తీ కట్ చేసుకో

వాషజంగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన రెండో దఫా పాలనలో విదేశాంగ విధానం ద్వారా తన ఆకాంక్షలను తీర్చుకునే పనిలో పడ్డారు. రాత్రికి రాత్రి వెనెజువెలాపై కమాండో దాడి జరిపి ఆ దేశ అధ్యక్షుడిని, ఆయన భార్యను బందీలుగా అమెరికాకు తరలించి ట్రంప్ తన పంతం నెరవేర్చుకున్నారు. అంతటితో ఆగని ట్రంప్.. దక్షిణ అమెరికా దేశాన్ని మొత్తం తానే నియంత్రిస్తున్నట్లు ప్రకటించుకుంటున్నారు. ఈ క్రమంలో ఇప్పుడు వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ ప్రభుత్వానికి ట్రంప్ కీలక హెచ్చరికలు చేసినట్లు తెలుస్తోంది. వెనెజువెలా కొత్త నాయకత్వం చైనా, రష్యా, ఇరాన్, క్యూబాలతో ఆర్థిక సంబంధాలను తెంచుకోవాలని హెచ్చరించినట్లు సమాచారం. అంతేకాదు, చమురు ఉత్పత్తిలో అమెరికాతో మాత్రమే భాగస్వామ్యం చేయాలని, ముఖ్యంగా హెవీ క్రూడ్ ఆయిల్ విక్రయాల్లో అమెరికాకు ప్రాధాన్యం ఇవ్వాల్సిందిగా ఒత్తిడి చేస్తున్నట్లు సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా పేర్కొంటోంది. వెనెజువెలా చమురు ఉత్పత్తిని పెంచుకోవాలంటే తాను పెట్టిన ఈ షరతులు పాటించాలని ట్రంప్ టీమ్ స్పష్టం చేసినట్లు ఏబీసీ న్యూస్ నివేదిక వెల్లడించింది. 'మొదట ఆ దేశం (వెనెజువెలా) చైనా, రష్యా, ఇరాన్, క్యూబాతో ఆర్థిక సంబంధాలను తెంచుకోవాలి. రెండోది.. వెనెజువెలా చమురు ఉత్పత్తిలో అమెరికాతో ప్రత్యేక భాగస్వామిగా ఉండేందుకు, భారీ ముడి చమురు విక్రయాల్లో అమెరికాకు అనుకూలంగా ఉండేందుకు అంగీకరించాలి' అని ట్రంప్ టీమ్ షరతులు పెట్టినట్లు సదరు నివేదిక పేర్కొంది.

## డైలీ సీరియల్‌లా ఫోన్ ట్యాపింగ్ విచారణ

మెదక్:ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ డైలీ సీరియల్‌లా సాగుతోందని బీజేపీ సీనియర్ నేత, మెదక్ ఎంపీ ఎం.రఘునందన్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం మెదక్‌లో రఘునందన్ రావు మాట్లాడుతూ.. ఫోన్ ట్యాపింగ్ కేసు డైలీ సీరియల్‌లా సాగుతోందని వ్యంగ్యంగా అన్నారు. కొండను తవ్వి ఎలుకను ఈ సిట్ పడుతుందో లేదో అంటూ సందేహం వ్యక్తం చేశారు. డేటాను సర్వీస్ ప్రొవైడర్ల వద్ద తీసుకోవచ్చునని అభిప్రాయపడ్డారు. నేడు కొండల్ రెడ్డి, రేపు ఆయన డ్రైవర్ ఇలా ఎన్నాళ్లు అంటూ? సిట్ వ్యవహారశైలిపై ఆయన కొంత అసహనం వ్యక్తం చేశారు. కర్త, కర్మ అన్ని ఒకరివైపే వేలు చూపిస్తున్నాయని.. కానీ ఆయనను పిలిచేందుకు భయపడుతున్నారంటూ రఘునందన్ పరోక్షంగా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ తతంగమంతా ఎన్నికల కోసం పిలుస్తున్నట్లుగా ఉందన్నారు. ÷ూఎ÷ు కాస్తా అఎ÷ు(కాంగ్రెస్ ఇన్వెస్టిగేషన్ టీమ్)లా మారిందంటూ ఎద్దేవా చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఫస్ట్ బాధితుడిని తానేనని గుర్తు చేశారు. మొక్కుబడిగా ఐదు రోజులు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించిం దంటూ రాష్ట్ర ప్రభుత్వంపై రఘునందన్ రావు మండిపడ్డారు. అసెంబ్లీని బాయ్‌కాట్ చేసి.. ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ పూర్తి వైఫల్యం చెందిందని విమర్శించారు. నీటి అంశాలపై చర్చకు పాలక పక్షం
మీనమేషాలు లెక్కిస్తే.. బీఆర్ఎస్ పార్టీ భయపడి పారిపోయిందని పేర్కొన్నారు. తమ సంఖ్య తక్కువ ఉన్నా గట్టిగా పోరాడి.. పాలక పక్షాన్ని బీజేపీ నిలదీసిందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా బీజేపి శాసనసభా పక్ష నేత మహేశ్వర రెడ్డిని అభినందిస్తున్నానని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తుంటే.. 20 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా సభలో లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది పాలమూరు జిల్లా మీద, కృష్ణా జలాల మీద కాంగ్రెస్ పార్టీకి ఉన్న చిత్తశుద్ధి ఇదంటూ అధికార పార్టీ సభ్యులపై నిప్పులు చెరిగారు. కొంతమంది తమ పార్టీ నుంచి వలసపోతే కాంగ్రెస్ అధికారంలోకివచ్చిందన్నారు. ఆలోచించుకోవాలంటూ వలస నేతలకు ఈ సందర్భంగా ఆయన కీలక సూచన చేశారు. యెన్నెం శ్రీనివాస రెడ్డి కూడా తమ పార్టీ నుంచి వెళ్లిన వారేనని గుర్తు చేశారు. ఆలోచించుకోవాలంటూ ఆయనకు హితవు పలికారు. అటు కాంగ్రెస్, ఇటు బీఆర్ఎస్‌లపై పోరాడేది.. ప్రజల పక్షాన ఉండేది బీజేపీ మాత్రమేనని ఎంపీ స్పష్టం చేశారు. తమ పార్టీలో కొత్త పాత అనేది ఏమీలేదని కుండబద్ధలు కొట్టారాయన. కల్వకుంట్ల కవిత పార్టీ స్థాపిస్తే.. దేశంలో 6202వ పార్టీ అవుతుందన్నారు. ఎవరు కొత్త పార్టీ పెట్టిన తాము స్వాగతిస్తామని స్పష్టం చేశారు. ఒక నటుడు సినిమాకు టికెట్ల ధర పెంచి మరో నటుడికి పెంచకపోతే అది పక్షపాతం అవుతుందన్నారు. అందరికీ ఒకటే రూల్ ఉండాలి.. అన్ని సినిమాలకు ఒకటే రూల్ ఉండాలని రఘునందన్ తెలిపారు.

## ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు పరిశీలకులు

న్యూఢిల్లీ:త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న రాష్ట్రాలకు సీనియర్ పరిశీలకులను ఏఐసీసీ బుధవారంనాడు నియమించింది. అస్సాం, కేరళ, తమిళనాడు–పుదుచ్చేరి, పశ్చిమబెంగాల్‌కు ఈ పరిశీలకులను నియమించింది. ఈ నియమకాలు తక్షణం అమల్లోకి వచ్చినట్టు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. తమిళనాడు, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలకు ఏఐసీసీ పరిశీలకుడిగా తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. నాలుగు రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల పర్యవేక్షణకు ఏఐసీసీ సీనియర్ పరిశీలకులను నియమించింది. అస్సాం, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అస్సాం ఎన్నికల పరిశీలకులుగా భూపేష్ భగేల్, డీకే శివకుమార్, బంధు టిర్కి, కేరళకు సచిన్ పైలెట్, కేజె జార్జ్, ఇమ్రాన్, కన్హయ్య కుమార్, తమిళనాడు, పుదుచ్చేరికి పరిశీలకులుగా ముఖుల్ వాస్కీ, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఖాజి మహ్మద్ నిజాముద్దీన్.. పశ్చిమ బెంగాల్‌కు సుదీప్ రాయ్ భర్మన్, షకీల్ అహ్మద్ ఖాన్, ప్రకాష్ జోషిని నియమించినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శ కేసీ వేణుగోపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. అస్సాం రాష్ట్రానికి మాజీ సీఎం భూపేష్ బఘేల్, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, బంధు తిర్కీ ఏఐసీసీ సీనియర్ పరిశీలకులుగా నియమితులయ్యారు. కేరళ పరిశీలకులుగా రాజస్థాన్ మాజీ డిప్యూటీ సీఎం సచిన్ పైలట్, కేజే జార్జ్, ఇమ్రాన్ ప్రతాప్‌గఢి, కన్హయ్య కుమార్ నియమితులయ్యారు. తమిళనాడు, పుదుచ్చేరి పరిశీలకులుగా ముకుల్ వాస్నిక్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఖాజీ మె?హమ్మద్ నిజాముద్దీన్ పరిశీలకులుగా ఉంటారు. పశ్చిమబెంగాల్‌కు సుదీప్ రాయ్ బర్మన్, షకీల్ అహ్మద్ ఖాన్ పరిశీలకులుగా నియమితులయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో క్షేత్ర స్థాయిలో పార్టీ వ్యూహాలను అమలు చేయడం, అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల ప్రచారానికి సమన్వయం చేయడంలో సీనియర్ పర్యవేక్షకులు కీలక పాత్ర పోషించనున్నారు.

వేగుచుక్క

# ఆర్ పి హాస్పిటల్స్ ఆద్వర్యంలో.. క్రికెట్ పోటీలు షురూ.





## క్రీడలతో మానసిక ఉల్లాసం.

### హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బొద్దుల రాజేంద్రప్రసాద్.

**వేగుచుక్క న్యూస్, డిచ్ పల్లి:**

నిజామాబాదు నగరానికి చెందిన ఆర్పీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆద్వర్యంలో నిరహిస్తున్న డిచ్‌పల్లి క్రికెట్ టోర్నమెంట్ పోటీలు బుధవారం నడిపల్లి, సీఎంసీ మైదానంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. నాలుగు రోజుల పాటు జరిగే ఈ క్రిట్ పోటీలను ఆర్పీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బొద్దుల రాజేంద్రప్రసాద్ లాంచనంగా ప్రారంబించారు. క్రీడాకారుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన జెర్సీలను ఈ సందర్భంగా విడుదల చేశారు. అనంతరం డాక్టర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. క్రీడలతో మానసిక, శారీరక దృఢత్వం కలుగుతుందన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా, క్రీడల ద్వారా మానసిక శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలనే సంకల్పంతో క్రిట్ టోర్నమెంట్ ను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. డిచ్‌పల్లి మండలంలోని వివిధ గ్రామాలతో పాటు తెలంగాణ యూనివర్శిటీ, ఏడవ పోలీస్ బెటాలియన్ లకు చెందిన 16 జట్లు పోటీల్లో పాల్గొంటున్నాయనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త గాదె కృష్ణ, క్రికెట్ టోర్నమెంట్ ఆర్గనైజింగ్ చైర్మెన్ బి. వినోద్, టోర్నీ ఆర్గనైజింగ్ కార్యదర్శి చింతల గంగాదాస్, ప్రముఖ వైద్యులు దీపక్ రాథోడ్, జమాల్పూర్ రాజశేఖర్, ఆర్ అండ్ బి విశ్రాంత ఈఈ శ్రీమన్నారాయణ, నడిపల్లి తాండా సర్పంచ్ పవార్ శాంతిలాల్, ఉప సర్పంచ్ గణేష్, టోర్నీ నిర్వాహకులు జె. నరేష్, సాజిద్, మెరుగు నాగరాజు, మధుసూధన్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# లూయి బ్రెయిలీ ఒక లిపి కాదు.. అందుల ఆశాజ్యోతి.

### - నిజామాబాద్ సిపి సాయి చైతన్య.



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్**



లూయి బ్రెయిలీ ఒక లిపి కాదని, అందుల ఆశాజ్యోతిగా మహోన్నత మార్గానికి శ్రీకారం చుట్టారని నిజామాబాద్ సిపి సాయి చైతన్య అన్నారు. జిల్లా కేంద్రంలోని నూతన కలెక్టరేట్ కు సమీపంలో గల స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ కన్స్ట్రక్షన్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న అందుల వనరుల కేంద్రం ఆవరణలో అంధుల జీవనజ్యోతి, అక్షర ప్రదాత, బ్రెయిలీ లిపి నిర్మాత డాక్టర్ లూయి బ్రెయిలీ217వ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా సంక్షమ అధికారిని రసూల్ బి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజశ్రీ, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అందుల అభ్యున్నతికి అందత్వమనేది అడ్డు కాదని వారు ఉన్నత శిఖరాలకు ఎదగాలని, వారిలో ఆత్మవిశ్వాసం కల్పించే దిశగా లూయీ బ్రెయిలీ తన తండ్రి ప్రోత్సాహం ద్వారా లిపిని తయారు చేయడం జరిగిందని తెలిపారు. సర్వేంద్రియానం నయనం ప్రధానం అని పెద్దలు చెప్పడం జరిగిందని, కళ్ళులేకున్నప్పటికీ ప్రపంచాన్ని ఏ విధంగా చూడడం అనేది ఆయన ఆలోచన ద్వారా బ్రెయిలీ లిపి లిఖించేందుకు ముందుకు రావడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్నేహ సొసైటీ మానసిక దివ్యాంగుల పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి, కార్యదర్శి సిద్దయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నలంద విద్యార్థులకు రాష్ట్ర స్థాయి ర్యాంకులు.

### - అభినందించిన యాజమాన్యం ప్రసాద్, సాగర్.







**వేగుచుక్క న్యూస్, ఆర్మూర్:**

పట్టణంలోనిమామిడిపల్లిలో గల నలంద స్కూల్ విద్యార్థులు ఇ అభ్యాస్ అకాడమీ, హైదరాబాద్ వారు నిర్వహించిన ప్రతిష్ఠాత్మకమైన రామన్ సైన్స్ మహోత్సవ్ ఐఐటి పరీక్షలో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారు. 9వ తరగతి విద్యార్థి పి. చిన్మయి (రాష్ట్ర 2వ ర్యాంకు), 7వ తరగతి విద్యార్థిని ౣ. రాజశ్రీ (రాష్ట్ర 2వ ర్యాంకు), 6వ తరగతి విద్యార్థులు ఎస్. సన్విత్ౣ. గంగ శంకర్, ఎం. హర్షవర్ధన్, పి. యువరాజ్, జి. మనుష్, ఏ. అక్విల్ ఉ (రాష్ట్ర 5వ ర్యాంకులు) సాధించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ ప్రసాద్, ప్రిన్సిపాల్ సాగర్ విద్యార్థులను హృదయపూర్వకంగా అభినందిస్తూ, ఇది పాఠశాలకూ తల్లిదండ్రులకూ గర్వకరణం అని తెలిపారు. అలాగే విద్యార్థుల విజయానికి మార్గదర్శకత్వం అందించిన ఐఐటి సైన్స్ ఉపాధ్యాయులు నిఖిలా, భాను, రాజశేఖర్ లను ప్రత్యేకంగా ప్రశంసించారు. నలందా హై స్కూల్ విద్యార్థులు విద్యా రంగంలో నిరంతరం ఉత్తమ ఫలితాలు సాధిస్తూ మరిన్ని విజయాలు అందుకోవాలని వారు కోరారు.

# భిక్కనూరు బంద్ ప్రశాంతం.



## ఫార్మా కంపెనీ పై తీవ్ర వ్యతిరేకత.

### ఫ్యాక్టరీ వద్దు, ప్రాణాలే ముఖ్యం అంటూ చాటి చెప్పిన ప్రజలు.




**వేగుచుక్క న్యూస్, భిక్కనూరు**

పార్మ కంపెనీ వద్దు, ప్రాణాలే ముఖ్యం అంటూ మండల ప్రజలు బుధవారం చేపట్టిన బంద్ ప్రశాంతంగా జరిగింది. ఫ్యాక్టరీ ఏర్పాటుతో ఉపాధి దొరుకుతుందేమో కానీ తమ ప్రాణాలు గాలిలో కలుస్తాయని మండల ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో అడిషనల్ కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలు తమ వ్యతిరేకతను తేల్చి చెప్పారు. మండల కేంద్రంలో 667 సర్వే నంబరులో 9.26 ఎకరాల విస్తీర్ణంలో ఫ్యూషన్ హెల్త్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో బల్క్ డ్రగ్స్, ఇంటర్మీడియట్ తయారీ యూనిట్ ఏర్పాటు చేయనున్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని 18 గ్రామాల ప్రజలతో కంపెనీ ఏర్పాటు చేసే స్థలంలో తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ విక్టర్ బుధవారం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమానికి సుమారు వెయ్యి మంది హాజరయ్యారు. కంపెనీ ఏర్పాటుతో వాయు కాలుష్యం,

నీటి కాలుష్యం ఏర్పడుతుందని ప్రజలు పేర్కొన్నారు. కంపెనీ ఏర్పాటుతో అనారోగ్యానికి గురవుతామని తెలిపారు. మరో వైపు కంపెనీ వద్దంటూ చేపట్టిన బంద్ లో మండలంలోని అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు.

# కాలానికి అనుగుణంగా నూతన ఆవిష్కరణలు జరగాలి.

### - ఘనంగా 53వ వైజ్ఞానిక ప్రదర్శన (ఇన్స్పైర్ ) ప్రారంభం.



**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి:**

53వ బాల వైజ్ఞానిక ప్రదర్శిని మరియు ఇన్స్పైర్ మనక్ ప్రదర్శనలను బుధవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని అబ్దుల్ కలాం ప్రాంగణం విద్యానికేతన్ హై స్కూల్ లో అంగరంగ వైభవంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్, ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు పింగళి శ్రీపాల్ రెడ్డి, ఎస్ సి ఆర్ టి డైరెక్టర్ రమేష్ , ఆర్జెడి సత్యనారాయణ, అతిధులుగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా

ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు పింగిలి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకతను పెంపొందించడంలో సైన్స్ ఫెయిర్లు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. చిన్న వయసులోనే పరిశోధనాత్మక ఆలోచనలు అలవడితే భవిష్యత్తులో దేశ అభివృద్ధికి బలమైన పునాది పడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన శాస్త్రీయ నమూనాలు ప్రశంసనీయమని, వారికి మార్గనిర్దేశం చేసిన ఉపాధ్యాయుల కృషి అభినందనీయమని తెలిపారు. ఇలాంటి వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో కొత్త ఆవిష్కరణలకు ప్రేరణనిచ్చి, భవిష్యత్తు శాస్త్రవేత్తలను తయారు చేస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

**జహీరాబాద్ ఎంపీ సురేష్ మాట్లాడుతూ,**

పూర్వ విద్యా విధానం కన్నా విద్యావ్యవస్థ బలపడాలంటే తప్పక నూతన వరబడెలైనటువంటి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మరియు శాస్త్ర సాంకేతిక రంగాలలో సాటిలైట్ టెక్నాలజీ హైడ్రోజన్ ఎనర్జీ వంటి నూతన విధానాలకు ప్రేరణ కల్పించే విధంగా ఉపాధ్యాయులు బోధించాలని అలాంటి ఆవిష్కరణలనే విద్యార్థులు చేసేలా ప్రోత్సహించాలని అప్పుడే నూతన భారతం నిర్మితమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థులలో సృజనాత్మకత ప్రతి ఒక్క విద్యార్థుల్లోనూ ఉంటుందని దానిని వెలికి తీసి సరైన మార్గంలో వారికి మార్గ నిర్దేశం చేయడమే సైన్స్ ఉపాధ్యాయులుగా కర్తవమని జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ రెడ్డి పేర్కొన్నారు.

**ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ,**

తమ ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తుందని గౌరవ ముఖ్యమంత్రి గారు తన వద్దనే శాఖను ఉంచుకోవడం విద్యారంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్నటువంటి ప్రాధాన్యతను తెలియపరుస్తుందని తెలిపారు.

ముందుగా స్వాగతం ఉపన్యాసం చేసిన జిల్లా విద్యాశాఖ అధికారి రాజు మాట్లాడుతూ, గత 15 రోజులుగా 27 కమిటీలలో ఉపాధ్యాయులను ప్రతి కమిటీకి గెజిటెడ్ అధికారిని కన్వీనర్ గా నియమించి ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు జరగకుండా నిరంతరం సమీక్షస్తూ ఏర్పాటు చేయడం జరిగిందని విద్యార్థులందరూ కూడా సౌకర్యవంతమైన వాతావరణంలో తమ ప్రదర్శనలను ప్రదర్శించి ఉన్నతమైన ప్రదర్శనలను సౌత్ ఇండియా స్థాయికి చేరాలని ఆశీర్వదించడం జరిగింది తదనంతరం జిల్లా సైన్స్ అధికారి సిద్ధరామిరెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్ కామారెడ్డిలో జరగడానికి సహకరించిన పెద్దలందరికీ ధన్యవాదాలు తెలియజేస్తూ కామారెడ్డి జిల్లాలో ఎక్కడా లేనివిధంగా గౌరవ జిల్లా కలెక్టర్ గారి సహాయంతో స్కై వాచ్ క్లబ్బులు ఇస్రో పర్యటనలు ఇన్నోవేషన్ల కొరకు ప్రోత్సాహకాలు వంటి వినూత్న కార్యక్రమాలను చేపడుతున్నామని దీని ద్వారా విద్యార్థులలో శాస్త్ర సాంకేతిక రంగాల పట్ల జిజ్ఞాస పెరుగుతుందని తెలిపినారు. అలాగే విద్యాశాఖ తరపున చేస్తున్న ప్రయత్నాలకు జిల్లాలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులు మరియు ఉపాధ్యాయ సంఘాల నాయకులు అందిస్తూ సైన్స్ రంగంలో మన జిల్లా వాసులు ముందుకు వెళ్లడానికి సహకరిస్తున్నందుకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది .



# అమెరికాలో చట్టవిరుద్ధ పనులు చేయకండి

న్యూఢిల్లీ: ఇండియాపై అమెరికా కక్ష కట్టినట్లే ఉంది. ఇటీవల అగ్రరాజ్యం వ్యవహరిస్తోన్న తీరు చూస్తుంటే అట్లే అనిపిస్తోంది. ఒకవైపు సుంకాల పేరుతో ఇండియాపై ట్రంప్ ఇష్టారీతిన టారిఫ్స్ విధిస్తుంటే.. మరోవైపు భారతీయ విద్యార్థులపై అమెరికా కఠిన ఆంక్షలు విధిస్తుంది. తాజాగా మరోసారి ఇండియన్ స్టూడెంట్స్‌కు అమెరికా వార్నింగ్ ఇచ్చింది. ఈ మేరకు న్యూఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. అమెరికాలో చదువుతున్న భారతీయ విద్యార్థులు ఏదైనా ఉల్లంఘనలకు పాల్పడితే దేశ బహిష్కరణకు గురయ్యే అవకాశం ఉందని హెచ్చరించింది. అమెరికాలోకి ప్రవేశించడం ఒక హక్కు కాదని.. వీసా హోల్డర్లందరూ స్థానిక చట్టాలు, నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని నొక్కి చెప్పింది. 'యుఎస్ చట్టాలను ఉల్లంఘించడం మీ స్టూడెంట్ వీసాపై తీవ్ర పరిణామాలు చూపించవచ్చు. రూల్స్ బ్రేక్ చేసి అరెస్ట్ అయినా, ఏదైనా చట్టాలను ఉల్లంఘించినా మీ వీసా రద్దు కావొచ్చు. దేశం నుంచి మిమ్మల్ని బహిష్కరించవచ్చు. అలాగే.. భవిష్యత్తులో యుఎస్ వీసాలకు మీరు అనర్హులుగా మారవచ్చు. నియమాలను పాటిస్తూ మీ ప్రయాణాన్ని ప్రమాదంలో పడేయకండి. యుఎస్ వీసా అనేది ఒక ప్రత్యేక హక్కు, పూర్తి హక్కు కాదు' అని యుఎస్ ఎంబసీ పేర్కొంది. అమెరికాలో ఉన్న సమయంలో విద్యార్థులు జాగ్రత్తగా, బాధ్యతాయుతంగా ఉండాలని సూచించింది. ట్రంప్ రెండో అమెరికా పగ్గాలు చేపట్టాక కీలక మార్పులకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఇందులో స్టూడెంట్ వీసా ఒకటి. స్టూడెంట్ వీసా ఫీజులను భారీగా పెంచడం, తప్పనిసరి సోషల్ మీడియా తనిఖీ వంటి కఠిన ఆంక్షలు విధించారు. ట్రంప్ పరిపాలన ఆంక్షలతో స్టూడెంట్స్ అమెరికా వెళ్లడం కష్టతరంగా మారింది.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం

హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ రావు తండ్రి కొండల్ రావుకు సిట్ అధికారులు నోటీసులు ఇచ్చారు. అంతేకాదు.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కొడుకు సందీప్ రావుకు కూడా నోటీసులు ఇచ్చారు. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటకు జూబ్లీహిల్స్ పీఎస్‌కి రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. రెండు రోజుల క్రితం ఎమ్మెల్సీ నవీన్ రావును సిట్ అధికారులు విచారించారు. దాదాపు 9 గంటల పాటు విచారణ సాగింది.

ఉదయం 11 గంటలకు మొదలైన విచారణ రాత్రి 8 గంటల వరకు సాగింది. బీఆర్ఎస్ పెద్దలతో ఉన్న ఆర్థిక సంబంధాల గురించి నవీన్ రావును అధికారులు విచారించినట్లు సమాచారం. విచారణ అనంతరం నవీన్ రావు మీడియాతో మాట్లాడుతూ.. గతంలో విచారణకు హాజరయ్యానని, అప్పట్లో మూడు గంటల పాటు అధికారులు తనను విచారించారని చెప్పారు. అప్పుడు చెప్పిన విషయాలనే ఇప్పుడు కూడా చెప్పానని అన్నారు. విచారణకు సహకరించానని, మళ్లీ పిలిచినా కూడా వస్తానని స్పష్టం చేశారు.

వేగుచుక్క

# బొమ్మరిల్లు 2 తీయొచ్చు



టాలీవుడ్‌లో యంగ్ హీరోగా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకున్న ఆది సాయికుమార్ కెరీర్‌కు తాజాగా విడుదలైన 'శంబాల' కొత్త ఊపునిచ్చింది. ఈ రోజుల్లో చిన్న సినిమాతో ప్రేక్షకులను ఫిదా చేసి, బాక్సాఫీస్ వద్ద విజయం అందుకోవడం అంత తేలిక కాదని అందరూ ఒప్పుకునే నిజం. అలాంటి పరిస్థితుల్లో 'శంబాల' మంచి కంటెంట్, పాజిటివ్ మౌత్‌టాక్‌తో ప్రేక్షకుల ఆదరణ పొందుతూ సక్సెస్ బాట పట్టింది. క్రిస్మస్ కానుకగా విడుదలైన ఈ సినిమా థియేటర్లలో నిలకడగా రన్ అవుతూ, ఆది సాయికుమార్ మార్క్‌ను మరోసారి చాటుకుంది.

ఈ సినిమా విజయం నేపథ్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన థ్యాంక్స్ మీట్‌లో పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ 'శంబాల'పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ఈ రోజుల్లో ఒక సినిమాతో ప్రేక్షకులను మెప్పించడం చాలా కష్టం. కానీ 'శంబాల' అది చేసి చూపించింది. ఈ చిత్ర ప్రోమో చూసినప్పుడే ఇది సక్సెస్ అవుతుందని అనిపించింది" అంటూ చిత్రబృందాన్ని అభినందించారు. అలాగే ఇది ఆది సాయికుమార్ కెరీర్‌లో 25వ సినిమా కావడం మరింత ప్రత్యేకమని చెప్పారు.

దిల్ రాజు మరో ఆసక్తికర అంశాన్ని కూడా ప్రస్తావించారు. "ఒకప్పుడు 'బొమ్మరిల్లు' సినిమా టాలీవుడ్‌లో కొత్త ట్రెండ్‌ను తీసుకొచ్చింది. నిజంగా 'బొమ్మరిల్లు 2' తీయాలంటే మాత్రం ఆది సాయికుమార్, ఆయన తండ్రి సాయికుమార్ ఇద్దరితోనే తీయాలి. కొడుకు విజయం కోసం తండ్రి పడే తపన మాటల్లో చెప్పలేం" అని అన్నారు. ఈ వ్యాఖ్యలు కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఇక హీరో ఆది సాయికుమార్ మాట్లాడుతూ.. "ఎంతో పోటీ మధ్య విడుదలైన మా సినిమా ఇప్పటికీ విజయవంతంగా రన్ అవుతుండటం ఆనందంగా ఉంది. ప్రేక్షకులు మౌత్‌టాక్‌తో సినిమాను ముందుకు తీసుకెళ్తున్నారు. వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు. ఇకపై మరింత మంచి సినిమాలు చేయాలనే ఉత్సాహం వచ్చింది" అని చెప్పారు. నటుడు సాయికుమార్ సైతం "మంచి కంటెంట్ ఎప్పుడూ గెలుస్తుందని 'శంబాల' మరోసారి నిరూపించింది. ఈ నెల 9న హిందీలో విడుదలవుతున్న ఈ సినిమా అక్కడ కూడా విజయం సాధించాలని కోరుకుంటున్నా" అంటూ తన ఆనందాన్ని వ్యక్తం చేశారు.

# ఆయనకేమైంది!



మెగాస్టార్ చిరంజీవి నటించిన లేటెస్ట్ మూవీ 'మన శంకర వర ప్రసాద్ గారు' మరికొద్ది రోజుల్లో సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది. సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం పూర్తిస్థాయి ఫ్యామిలీ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందింది. సంక్రాంతి బరిలో భారీ అంచనాలతో నిలుస్తున్న ఈ సినిమాతో మరోసారి బాక్సాఫీస్ వద్ద తన మ్యానియా ఏంటో నిరూపించేందుకు చిరంజీవి సిద్ధమయ్యారు. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలు, ప్రమోషనల్ వీడియోలు సినిమాపై సాలిడ్ బజ్ క్రియేట్ చేశాయి. ముఖ్యంగా అనిల్ రావిపూడి మార్క్ కామెడీ, మెగాస్టార్ టైమింగ్ కలయిక ఈ సినిమా హిట్ అవుతుందనే నమ్మకాన్ని అభిమానుల్లో బలంగా నాటింది. ఫెస్టివల్ సీజన్ కావడంతో కుటుంబ ప్రేక్షకుల్లోనూ ఈ సినిమాపై భారీ క్రేజ్ నెలకొంది. అయితే, సినిమా ప్రమోషన్లు జోరుగా సాగుతున్నప్పటికీ ఈ కార్యక్రమాల్లో ఎక్కడా మెగాస్టార్ చిరంజీవి కనిపించకపోవడం ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. సాధారణంగా చిరంజీవి తన సినిమాల ప్రమోషన్లలో స్వయంగా పాల్గొని మీడియా ఇంటర్వ్యూలు,ప్రీ రిలీజ్ ఈవెంట్లలో సందడి చేస్తుంటారు. కానీ ఈసారి పరిస్థితి భిన్నంగా ఉండటంతో "చిరు ఎందుకు ప్రమోషన్లకు దూరంగా ఉన్నారు?" అనే ప్రశ్నలు మొదలయ్యాయి. గత కొంతకాలంగా మోకాలి నొప్పులతో ఇబ్బంది పడుతున్న ఆయన, సినిమా షూటింగ్ పూర్తయ్యాక డాక్టర్ల సలహా మేరకు శస్త్రచికిత్స చేయించుకున్నారని టాక్. డాక్టర్లు ఆయనకు పూర్తిస్థాయి విశ్రాంతి అవసరమని సూచించడంతో, ప్రస్తుతం చిరంజీవి ఎలాంటి ఫిజికల్ స్ట్రెస్ తీసుకోకుండా రెస్ట్‌లో ఉన్నారని సమాచారం. ఈ కారణంగానే సినిమా ప్రమోషన్ల బాధ్యతలన్నింటినీ దర్శకుడు అనిల్ రావిపూడి తానే భుజాన వేసుకున్నట్లు తెలుస్తోంది. మీడియా ఇంటరాక్షన్లు, ప్రమోషనల్ ఈవెంట్లలో ఆయనే సినిమా తరఫున మాట్లాడుతూ హైప్ పెంచుతున్నారు. సమాచారం ప్రకారం చిరంజీవి కనీసం మరో నెల రోజుల పాటు విశ్రాంతి తీసుకునే అవకాశం ఉందని, దీంతో సినిమా రిలీజ్ సమయంలో కూడా ఆయన పబ్లిక్ అప్పియరెన్స్ ఉండకపోవచ్చనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ వార్తలతో మెగాస్టార్ అభిమానుల్లో కాస్త ఆందోళన నెలకొన్నప్పటికీ, ఆయన ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతోందని, పూర్తిగా కోలుకున్న తర్వాత మళ్లీ సినిమాలపై ఫోకస్ పెడతారని సినీ వర్గాలు భరోసా.

# కారణం అదేనా!



గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ వయసు పెరుగుతున్న కొద్దీ ఎనర్జీ, కమిట్‌మెంట్, మాస్ క్రేజ్ విషయంలో మాత్రం యంగ్ హీరోలకు గట్టి పోటీ ఇస్తున్నారు. 'అఖండ'తో మొదలైన హిట్ పరంపర 'వీరసింహారెడ్డి', 'భగవంత్ కేసరి', 'డాకు మహరాజ్ణ వరకు కొనసాగుతూ బాలయ్య మార్కెట్‌ను మరింత బలపరిచింది. ఇటీవల 'అఖండ 2' ఆశించిన స్థాయిలో బాక్సాఫీస్ ఫలితం ఇవ్వకపోయినా, బాలయ్య క్రేజ్‌పై మాత్రం ఎలాంటి ప్రభావం పడలేదు. ఈ నేపథ్యంలోనే దర్శకుడు గోపీచంద్ మలినేనితో ఆయన చేయబోయే కొత్త సినిమా పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. గతంలో ఈ కాంబినేషన్‌లో వచ్చిన 'వీరసింహారెడ్డి' సూపర్ హిట్ కావడంతో, మరోసారి ఈ జోడీ బాక్సాఫీస్‌ను షేక్ చేయడం ఖాయమనే నమ్మకం అభిమానుల్లో కనిపిస్తోంది.

ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో, పీరియాడికల్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కించాలని మొదట ప్లాన్ చేశారు. ఇప్పటికే పూజా కార్యక్రమాలతో ఈ ప్రాజెక్ట్ అధికారికంగా ప్రారంభమైంది. బాలయ్య ఈ చిత్రంలో ద్విపాత్రాభినయం చేయనున్నారని, అందులో ఒక పాత్ర మహారాజుగా ఉండబోతుందన్న ప్రచారం కూడా అప్పట్లో బాగా వినిపించింది. 'మహారాజు' అనే టైటిల్‌ను కూడా పరిశీలనలో ఉన్నట్టు సోషల్ మీడియాలో టాక్ నడిచింది. మొదటి షెడ్యూల్ నుంచే భారీ యాక్షన్ సన్నివేశాలు, రామ్‌ఉలక్ష్మణ్ కొరియోగ్రఫీతో పవర్‌ఫుల్ ఫైట్స్ ఉండబోతున్నాయన్న వార్తలు సినిమాపై హైప్‌ను మరింత పెంచాయి.అయితే ఈ సినిమాలో బాలయ్య సరసన లేడీ సూపర్ స్టార్ నయనతార నటించాల్సి ఉండగా, ఆమెను ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పించే అవకాశాలున్నాయన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఇందుకు కారణంగా ఆమె డిమాండ్ చేస్తున్న భారీ రెమ్యూనరేషన్‌నే చూపిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఈ సినిమా కోసం నయనతార దాదాపు రూ.8 కోట్ల రెమ్యూనరేషన్ కోరిందట. ఇప్పటికే స్క్రిప్ట్ దశలోనే బడ్జెట్ భారీగా పెరుగుతున్న నేపథ్యంలో, నిర్మాతలు ఖర్చులపై జాగ్రత్త పడాలని నిర్ణయించుకున్నారట. నయనతార స్థానంలో మరో హీరోయిన్‌ను తీసుకుంటే రూ.1–2 కోట్ల వరకు ఇస్తే సరిపోతుందని, దీంతో దాదాపు రూ.6 కోట్ల వరకు బడ్జెట్ సేవ్ అవుతుందని మేకర్స్ ఆలోచిస్తున్నారన్న టాక్ వినిపిస్తోంది. అయితే ఈ విషయంలో ఇప్పటివరకు అధికారిక క్లారిటీ మాత్రం రాలేదు.

# క్లారిటీ వచ్చేసిందిగా!



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, 'ఉప్పెన'తో దర్శకుడిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న గ్రామీణ నేపథ్య స్పోర్ట్స్ రివేంజ్ డ్రామా 'పెద్ది' టాలీవుడ్‌లో ప్రస్తుతం అత్యంత హైప్ ఉన్న ప్రాజెక్ట్‌గా నిలుస్తోంది. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తుండగా, మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ భాగస్వాములుగా ఉండటం సినిమాకు మరింత బలాన్ని చేకూర్చింది. రామ్ చరణ్ సరసన బాలీవుడ్ హీరోయిన్ జాన్వీ కపూర్ కథనాయికగా నటిస్తుండగా, కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఆస్కార్ విజేత ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్నారు.

ఏ.ఆర్. రెహమాన్ పుట్టినరోజు సందర్భంగా 'పెద్ది' సినిమా టీమ్ ఆయనకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపింది. "'చికిరి చికిరి' పాట కేవలం ఆరంభం మాత్రమే రాబోయే పాటల్లో రెహమాన్ మ్యాజిక్ మరింత గట్టిగా వినిపించబోతోంది" అని పేర్కొన్నారు. సినిమాకు రెహమాన్ సంగీతం గొప్ప అదనపు బలమని, ఆయన మ్యూజిక్ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తుందని చిత్రబృందం విశ్వాసం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా 'పెద్ది' రిలీజ్ డేట్‌పై వినిపిస్తోన్న రూమర్లకు మేకర్స్ చెక్ పెట్టారు. రెహమాన్ పుట్టినరోజు సందర్భంగా చేసిన ట్వీట్‌లో ఈ మూవీని మార్చి 27న రిలీజ్ చేయబోతున్నట్లు మరోసారి ప్రకటించడంతో వాయిదా రూమర్లకు చెక్ పెట్టినట్లయింది. 'గేమ్ ఛేంజర్ణ వంటి డిజాస్టర్ తర్వాత రామ్ చరణ్ నుంచి వస్తున్న సినిమా కావడంతో 'పెద్ది'పై భారీ అంచనాలున్నాయి. ఇప్పటికే విడుదలైన పోస్టర్స్‌తో పాటు 'చికిరి చికిరి' పాట ప్రేక్షకుల్ని విపరీతంగా ఆకట్టుకుంది. గ్రామీణ నేపథ్యనికి తగ్గ ఫోక్ టచ్, ఎనర్జిటిక్ రిథమ్, రామ్ చరణ్ మాస్ లుక్, బాడీ లాంగ్వేజ్ అన్నీ కలిసి ఈ పాటను చార్ట్‌బస్టర్‌గా మార్చాయి. సోషల్ మీడియాలో ఈ సాంగ్ రీల్స్, షార్ట్ వీడియోల రూపంలో వైరల్ అవుతూ 'పెద్ది'పై నమ్మకాన్ని మరింత బలపరిచింది.

ఈ స్పందనతో సినిమా కంటెంట్ పరంగా కూడా బలంగా ఉండబోతోందన్న అభిప్రాయం ప్రేక్షకుల్లో వ్యక్తమవుతోంది. ఇక అభిమానులకు మరో శుభవార్త ఏమిటంటే, సంక్రాంతికి సెకండ్ సింగిల్ విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారన్న టాక్ గట్టిగా వినిపిస్తోంది.


# ఎమోషనల్ స్పీచ్ !

కోలీవుడ్‌లో ఈ సంక్రాంతి (పొంగల్) సీజన్ బాక్సాఫీస్ పోరు కేవలం సినిమాల మధ్యనే కాకుండా అభిమానుల మధ్య కూడా హాట్ వార్‌లా మారింది. ఈ నేపథ్యంలో హీరో శివకార్తికేయన్ నటించిన తాజా చిత్రం 'పరాశక్తి' ఇప్పటికే భారీ చర్చను రేపుతోంది. ప్రముఖ దర్శకురాలు సుధా కొంగర తెరక్కించిన ఈ పొలిటికల్ డ్రామా 1960ల నాటి మద్రాస్ నేపథ్యంతో, హిందీ వ్యతిరేక ఉద్యమం చుట్టూ సాగనుంది.

ఈ చిత్రంలో శ్రీలీల కథనాయికగా నటిస్తుండగా, సంగీతాన్ని జీవీ ప్రకాష్ కుమార్ అందించారు. కంటెంట్ ఓరియెంటెడ్ కథ, బలమైన క్యాస్టింగ్, టెక్నికల్ టీమ్ కారణంగా 'పరాశక్తి'పై మొదటి నుంచే అంచనాలు భారీగా ఉన్నాయి. ఈ సినిమా జనవరి 10న సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఇదిలా ఉండగా, 'పరాశక్తి' ప్రీ–రిలీజ్ ఈవెంట్‌లో శివకార్తికేయన్ చేసిన ఎమోషనల్ స్పీచ్ ఇప్పుడు కోలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ వేదికపై ఆయన తనపై, తన కుటుంబంపై జరుగుతున్న సోషల్ మీడియా సైబర్ దాడుల గురించి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. "నా కెరీర్‌లో ఎన్నో పెయిడ్ సైబర్ అటాక్స్ చూశాను. కానీ ఈసారి హద్దులు దాటి నా కుటుంబాన్ని కూడా వివాదాల్లోకి లాగుతున్నారు. ఇది చాలా బాధాకరం" అంటూ ఆయన భావోద్వేగానికి లోనయ్యారు.

ఈ సమయంలో వేదిక కింద కూర్చున్న ఆయన భార్య ఆర్తి ముఖం చిన్నబోగా మారగా, తల్లి రాజీ దాస్ కన్నీళ్లు పెట్టుకోవడం అక్కడున్నవారిని కలచివేసింది.తన తల్లిని ఉద్దేశిస్తూ శివకార్తికేయన్ చేసిన వ్యాఖ్యలు ఈ ఈవెంట్‌లో హైలైట్‌గా నిలిచాయి. "మా అమ్మ నన్ను అడిగిందొ ఇలాంటి సమయంలో మనకు ఎవరున్నారు అని. కానీ ఇప్పుడు నేను ఆమెకు ధైర్యంగా చెబుతున్నానొ నన్ను ప్రేమించే లక్షలాది మంది అభిమానులు నా వెనుక ఉన్నారు" అని అన్నారు. ఈ మాటలతో ఆయన తల్లి కన్నీళ్లు తుడుచుకుంటూ గర్వంగా నవ్వడం ప్రేక్షకులను భావోద్వేగానికి గురి చేసింది. ఈ సీన్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.



# శరవేగంగా షూటింగ్..



ఎన్టీఆర్ హీరోగా తెరక్కుతోన్న పీరియాడిక్ పాన్ ఇండియా యాక్షన్ డ్రామా 'డ్రాగన్' (వర్కింగ్ టైటిల్) ప్రస్తుతం టాలీవుడ్‌లో అత్యంత భారీ అంచనాలు ఉన్న ప్రాజెక్ట్‌గా నిలుస్తోంది. ఎన్టీఆర్ కెరీర్‌లోనే గుర్తుండిపోయే సినిమాగా ఈ చిత్రం నిలుస్తుందని మేకర్స్ ధీమాగా చెబుతున్నారు. ప్రతిష్ఠాత్మక నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను నిర్మిస్తుండగా, ఎన్టీఆర్ ఆర్ట్స్ సమర్పిస్తోంది. హీరోయిన్‌గా రుక్మిణీ వసంత్ నటిస్తుండగా, సినిమాటోగ్రఫీ బాధ్యతలను భువన గౌడ నిర్వర్తిస్తున్నారు. ప్రశాంత్ నీల్ మార్క్ ఇంటెన్స్ యాక్షన్, ఎమోషనల్ డ్రామా ఈ చిత్రానికి ప్రధాన బలంగా నిలవనున్నాయి.ఈ సినిమా ప్రారంభమైనప్పటి నుంచి షూటింగ్ అప్‌డేట్స్ విషయంలో కొంత నిశ్శబ్దం నెలకొనడంతో అభిమానుల్లో అనేక సందేహాలు తలెత్తాయి. ఒక దశలో ప్రాజెక్ట్ మధ్యలో ఆగిపోయిందన్న ప్రచారం కూడా బలంగా వినిపించింది. దర్శకుడు ప్రశాంత్ నీల్ టేకింగ్‌పై ఎన్టీఆర్ అసంతృప్తిగా ఉన్నాడని, ఇద్దరి మధ్య విభేదాల వల్లే షూటింగ్ నిలిచిపోయిందని ఇండస్ట్రీ వర్గాల్లో జోరుగా వార్తలు చక్కర్లు కొట్టాయి. ఇదే సమయంలో ఎన్టీఆర్ మరో ప్రాజెక్ట్ 'దేవర 2'పై కూడా ఇలాంటి కథనాలు రావడంతో అభిమానులు మరింత ఆందోళనకు గురయ్యారు.అయితే ఆ పుకార్లన్నింటికీ చెక్ పెడుతూ, 'డ్రాగన్ యూనిట్ ఇటీవలే మళ్లీ షూటింగ్ ప్రారంభించింది. రుక్మిణీ వసంత్ ఈ షెడ్యూల్‌లో జాయిన్ కావడంతో షూటింగ్ వేగం పుంజుకుంది. ఇక కథ విషయానికి వస్తే, 1969 కాలంలో చైనా, భూటాన్, భారతదేశ సరిహద్దు ప్రాంతాల నేపథ్యంలో ఈ కథ సాగుతుందని తెలుస్తోంది. దేశభక్తి, రాజకీయ ఉద్రిక్తతలతో పాటు తల్లి సెంటిమెంట్ ఈ చిత్రంలో కీలకంగా ఉంటుందట. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ తల్లి పాత్రలో సీనియర్ బాలీవుడ్ నటి కాజోల్ నటిస్తున్నట్లు సమాచారం.

# ఫస్ట్ లుక్ విడుదల



స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. టాలీవుడ్‌లో అగ్ర కథనాయికగా తనదైన గుర్తింపు సంపాదించిన సమంత, సినిమాలు మాత్రమే కాకుండా వెబ్ సిరీస్‌లు, పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లతో దేశవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకుంది. 'ఫ్యామిలీ మ్యాన్ 2', 'సిటాడెల్: హనీ బన్నీ' వంటి వెబ్ సిరీస్‌లతో బాలీవుడ్, ఓటీటీ మార్కెట్‌లోనూ తన స్థాయిని చాటుకుంది. ఇదే సమయంలో వ్యక్తిగత జీవితంలోనూ కొత్త అధ్యాయాన్ని ప్రారంభించిన సమంతపై ఇటీవల రెండో పెళ్లి అంశానికి సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో చర్చకు దారితీశాయి. ఇప్పటికే నిర్మాతగా కూడా అడుగులు వేసిన సమంత, తన సినిమాల ఎంపికలో చాలా జాగ్రత్తగా ముందుకు సాగుతున్నారు. తెలుగులో ఇటీవల 'శుభం' సినిమాలో చిన్న క్యామియోతో కనిపించిన ఆమె నుంచి పూర్తి స్థాయి థియేట్రికల్ సినిమా కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఆ నిరీక్షణకు తెర దించుతూ సమంత నటిస్తున్న క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్ మా ఇంటి బంగారం ఇప్పుడు మళ్లీ వార్తల్లో నిలిచింది. ఈ సినిమాకు సంబంధించిన తాజా పోస్టర్‌ను సమంత స్వయంగా విడుదల చేయడంతో అభిమానుల్లో ఉత్సాహం రెట్టింపైంది. నందినీ రెడ్డి దర్శకత్వంలో తెరక్కుతున్న 'మా ఇంటి బంగారం' సమంతఉనందినీ రెడ్డి కాంబినేషన్‌లో మూడో చిత్రం కావడం విశేషం. 'ఓ బేబీ' తర్వాత ఈ జోడీ నుంచి వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగా ఉన్నాయి. తాజా మాస్ పోస్టర్‌లో సమంత పవర్‌ఫుల్, ఇంటెన్స్ లుక్‌లో కనిపించడంతో ఈసారి ఆమె పూర్తిగా భిన్నమైన పాత్రలో కనిపించనున్నట్లు స్పష్టమవుతోంది. ఇప్పటివరకు చేసిన పాత్రలకు పూర్తి విరుద్ధంగా, ఈ సినిమాలో క్రైమ్ యాక్షన్ నేపథ్యంలోని పాత్రలో సమంత కనిపించబోతున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ సందర్భంగా జనవరి 9న ఉదయం 10 గంటలకు ఈ సినిమా టీజర్ విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. "మీరు చూస్తా ఉండండి.. మా ఇంటి బంగారం మీ అందరితో కలిసిపోతుంది" అనే క్యాప్షన్‌తో సమంత ఈ పోస్టర్‌ను షేర్ చేయగా, అభిమానులు 'క్వీన్ ఈజ్ బ్యాక్ణ అంటూ కామెంట్స్ చేస్తున్నారు. చాలా కాలంగా ఎలాంటి అప్‌డేట్స్ లేకపోవడంతో ఈ సినిమా ఆగిపోయిందేమోనని అనుకున్న అభిమానులకు ఈ పోస్టర్ సాలిడ్ రిలీఫ్ ఇచ్చింది.